క్లుప్తంగా

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

లక్సెట్టిపేట: పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో మంగళవారం వామపక్షాల పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను ఏళ్ల నుంచి పూర్తి చేయడం లేదన్నారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లాల్‌కుమార్, శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకులు దొండ ప్రభాకర్, సీపీఐ నాయకులు మేదరి దేవవరం, రమణారెడ్డి, ప్రకాశం, ఆనంద్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కోటపల్లి: మండలకేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో బేటిబచావో-బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య అవగాహన కల్పించారు. బేటి బచావో-బేటి పడావో స్కీం ఏర్పాటుకు గల కారాణాలు, లక్ష్యాలు వివరించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టు విజయ ఉపాధ్యాయులు సురేందర్, సంపత్, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: సింగరేణిలో ఇప్పటివరకు మెడికల్ కార్డు(సీపీఆర్ఎంఎస్) లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీలో పనిచేసి రిటైర్డ్ అయిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన, చనిపోయిన వారి కుటుంబ సభ్యులు ఇప్పటికీ మెడికల్‌కార్డు తీసుకోకపోతే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇప్పటికీ కార్డు లేని వారు కార్డు కోసం రూ.60 వేలు చెల్లించాలని, ఇప్పటికే కార్డు కోసం కొంత మొత్తం వేతనంలో రికవరీ అయిన వారు మిగిలిన బ్యాలెన్సు డబ్బులు చెల్లించాలని సూచించారు. దీనికోసం రిటైర్డ్ ఉద్యోగులు వారి పనిచేసిన గనులు, డిపార్టుమెంట్ల కార్యాలయాలకు వెళ్లి సంబంధిత పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోదావరి పాత రోడ్డును పునరుద్ధరించాలి

జైపూర్: మండలంలోని రామారావుపేట గ్రామం నుంచి గోదావరి ఒడ్డు వరకు పంట పొలాలకు వెళ్లే పాత రోడ్డును మూసివేయగా మంగళవారం మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వనజారెడ్డి కలిసి సందర్శించారు. కాగా పాత రోడ్డును అలాగే కొనసాగించాలని, తొలగించిన గోదావరి రోడ్డును తిరిగి పునరుద్ధరించాలని స్థానిక రైతులు వారిని కోరారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ చిత్రపటాలకు గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. పొక్కూరు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి పథకాలు అమలు చేయడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎదగని యాసంగి వరి..!

- సల్ఫైడ్ ప్రభావంతో ఎర్రబారుతున్న మొలకలు
- నాట్లు వేసిన కొద్ది రోజులకే బయటపడిన దుష్ప్రభావం
- అప్రమత్తం కావాలంటున్న వ్యవసాయాధికారులు



సల్ఫైడ్ దుష్ప్రభావానికి గురైన వరిపంట

శివకృష్ణ, కేవీకే శాస్త్రవేత్త, బెల్లంపల్లి

బెల్లంపల్లి: యాసంగిలో వరి పంట సాగు విస్తారంగా జరుగుతోంది. పెద్ద చెరువులు, బోర్ల ఆధారంగా రైతులు వరిసేద్యం చేయడానికి నడుం బిగించారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా యాసంగిలో లక్ష ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా నాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. వరినాటు వేసిన కొద్దిరోజుల వ్యవధిలోనే పంటకు సల్ఫైడ్ దుష్ప్రభావంతో వరిలో ఎదుగుదల లోపించడం, వరి ఎర్రబడటం, వేరు కుళ్లిపోవడం వంటి ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ తెలిపారు. ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా పంటకు నష్టం కలిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. సల్ఫైడ్ దుష్ప్రభావం వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సల్ఫైడ్ దుష్ప్రభావానికి కారణాలు..

వరి పొలంలో రైతులు సరైన అవగాహన లేకుండా అధికంగా నీరు ఉంచడం వల్ల ఇది వ్యాప్తిస్తోంది. ఆ తీరుగా వ్యవహరించడం వల్ల వరిపంట వేర్లకు సరిగా గాలి అందని పరిస్థితులు ఏర్పడతాయి. పంట నేలలో జరిగే రసాయనిక చర్యలతో వచ్చే మార్పుల వల్ల సల్ఫైడ్ దుష్ప్రభావానికి కారణమవుతున్నాయి. వీటికితోడు పంటలు బాగా పెరగడానికి వినియోగించే అమ్మోనియం సల్ఫైడ్, సల్ఫర్‌తో కూడిన పోషకాలు అధికంగా వాడటం, కాంప్లెక్స్ ఎరువులను అధిక మోతాదులో వినియోగించడం, సల్ఫైడ్ కలిగిన కాంప్లెక్స్ ఎరువులను ఐరన్ లోపంలో ఉన్న నేలల్లో అధికంగా వాడటం వంటి కారణాలు వరిపంటలో సల్ఫైడ్ దుష్ప్రభావానికి తోడ్పడుతున్నాయి. తద్వారా పంట దిగుబడి 30నుంచి 50శాతానికి తగ్గిపోయే వీలుంటుంది.

యాసంగి సీజన్‌లో అధిక ప్రభావం..

సాధారణంగా సల్ఫైడ్ దుష్ప్రభావం వానాకాలం పంటలో కంటే యాసంగిలో సాగు చేసే పంటలో అధికంగా విస్తరిస్తుంది. వర్షాకాలంలో వర్షం నీటి వల్ల సల్ఫర్ త్వరితగతిన కరిగిపోతుంది. అయితే యాసంగిలో అలాంటి పరిస్థితులు ఉండవు. వరిపొలం నిండా నీరు నిలిపి ఉంచటం వల్ల సల్ఫైడ్ స్థిరంగా ఉంటుంది. వేగంగా కరిగిపోదు. రైతులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. నీటి నిల్వ సామర్థ్యాన్ని తగిన మోతాదులో ఉంచుకోవాల్సి ఉంటుంది. లేకపోతే పంటకు నష్టం కలిగేందుకు అధికంగా అవకాశాలు ఉంటాయి.

కనిపించే లక్షణాలు...

- సల్ఫైడ్ దుష్ప్రభావం వల్ల గుంపులు గుంపులుగా వరిపంట పసుపు రంగులోకి మారుతుంది.
- పంట ఎదుగుదల దెబ్బతిని దిగుబడిపై ప్రభావం చూపుతుంది.
- సల్ఫైడ్ ప్రభావం మోతాదుకు మించి ఉన్నప్పుడు, మట్టి నుంచి కుళ్లిపోయిన వాసన వస్తుంది. పొలంలో ఉన్న మట్టి మెత్తగా మారుతుంది.
- పొలంలో నుంచి బుడగల రూపంలో గాలి బయటకు వస్తుంది. మొక్కల ఎదుగుదల తగ్గి పోతుంది.
- పంట వేర్లు నల్లగా మారిపోవడం వంటి లక్షణాలు బహిర్గతమవుతాయి.

నివారణ చర్యలు..

ఆయా రకాల లక్షణాలు పంటలో కనిపించినట్లైతే రైతులు వెంటనే అప్రమత్తం కావాల్సి ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించకుండా నివారణ చర్యలు చేపట్టాలి. సల్ఫైడ్ దుష్ప్రభావం నివారణకు ఏమాత్రం జాప్యం చేయకుండా మొక్క వేర్లకు తగినంత గాలి సరఫరా అయ్యేలా చూడాలి. పొలంలో ఉన్న మురుగునీటిని తీసివేసి మళ్లీ కొత్త నీటిని అందించాలి. సన్న నెర్రెలు వచ్చేవరకు పొలాన్ని ఆరగట్టి, అడపాదడపా మళ్లీ నీటితడులు అందించాలి. ఆయా చర్యలతో దాదాపుగా సల్‌పేడ్‌ దుష్ప్రభావం తగ్గుతుంది. సల్ఫర్ ధాతువు గల కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని మానేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

'బీసీ యుద్ధభేరి' విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నూర్: ఫిబ్రవరి 2న వరంగల్ పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ పిలుపునిచ్చారు. చెన్నూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు జేక సంజీవ్, ముత్యాల రవికుమార్, రాజశేఖర్, ప్రశాంత్, రాజన్న, పున్నంచందు, వెంకటస్వామి, నారాయణ, రాళ్లబండి స్వామి, వెంకటేష్, లింగయ్య తదితరులు ఉన్నారు.

టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్లను మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వేరువేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడియారం శ్రీహరి, భూముల రామ్మోహన్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, ఏ.సతీశ్ కుమార్, కేజియా రాణి, శ్రీనివాస్, రాంకుమార్, తిరుపతి, అంజయ్య, సునిత, పద్మలత, ప్రభు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘ క్యాలెండర్...

మంచిర్యాలటౌన్: జిల్లా మున్నూరు కాపు సంఘ క్యాలెండర్‌ను మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మిట్ట లక్ష్మణ్, ట్రస్టు చైర్మన్ నల్ల శంకర్, పూదరి తిరుపతి, తూముల నరేశ్, బొలిశెట్టి కిషన్, జంగం పెల్లి బాపన్న, బొలిశెట్టి రాజన్న, గొంగల్ల శంకర్, డేగ బాపు, కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేణుగానంలో రాణించిన ఉద్యోగులకు సన్మానం



సన్మానిస్తున్న ఈడీ శ్రీనివాసులు, అధికారులు

జైపూర్: కోల్ ఇండియా స్థాయిలో వేణుగానంలో రాణించి రవీంద్రకుమార్ స్వామి, శ్రీనిధి అవార్డులు సాధించగా వారిని మంగళవారం ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు, అధికారులు సన్మానించారు. కళాకారులను ప్రోత్సహించడంలో సింగరేణి సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏఐటీయూసీ నాయకులు పర్శయ్య, సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎంలు సుధాకర్, మధన్‌మోహన్, డీజీఎం పర్సనల్ అజ్మీరాతుకారం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈవో శ్రీనివాస్

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఫిబ్రవరి 6నుంచి 13వ తేదీవరకు స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు మంగళవారం మంచిర్యాలలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావును కలిశారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే దంపతులకు అందించారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: మహిళలు ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) అసిస్టెంట్ డైరెక్టర్ నాగేందర్ అన్నారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి కోర్సుల వైపు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు 22 కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుకన్య, ప్రోగ్రాం ఇన్‌చార్జి నీర్లతిరుపతి, శిక్షకురాలు వసుంధర, మహిళలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తాండూర్: మండలంలోని కొత్తపల్లికి చెందిన పాలాజి సువర్ణ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో పీఎంజేజేబీవై స్కీమ్‌లో రూ.436 వార్షిక ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ చేయించింది. అనారోగ్యంతో ఆమె గత ఏప్రిల్‌లో మృతి చెందగా ఇన్సూరెన్స్ కంపెనీ ఆమెకు నామినిగా ఉన్న కొడుకు విష్ణుకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ మంజూరు చేసింది. మంగళవారం గ్రామీణ బ్యాంక్ తాండూర్ శాఖ చీఫ్ మేనేజర్ గుగులోతు ఇందాల్ ఆ చెక్కును విష్ణుకు అందజేశారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహంలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి యాదయ్యలతో కలిసి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదవాలని, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందునా విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించడంలో పాటు జాతీయ స్థాయిలో అండర్ 17 క్రికెట్ జట్టుకు ఎంపికైన జైపూర్ వెనకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతి గృహ విద్యార్థిని సంజనను సత్కరించారు. కార్యక్రమంలో వెనకబడిన తరగతుల సహాయ అధికారి భాగ్యవతి, వసతి గృహ సంక్షేమాధికారులు శ్రీహరి, ధర్మానంద్‌గౌడ్, తిరుపతి, శ్రీనివాస్, మోసిన్, నరేష్, సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీవో కిషన్
- ఈజీఎస్ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక
- రూ.13వేలు జరిమానా, రూ.1237 రికవరీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

బెల్లంపల్లిరూరల్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ ప్రజావేదికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీల్లో 2023–24ఆర్థిక సంవత్సరానికి రూ.3.60కోట్ల నిధులతో చేపట్టిన 266రకాల పనులపై సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో నివేదికలు చదివి వినిపించారు. ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయి. ఆయా గ్రామాల్లో ఒక కూలీకి బదులు మరో కూలీ పనికి వెళ్లి వేతనాలు పొందినట్లు, మరికొంత మందికి పనులకు హాజరు కాకుండానే వేతనాల చెల్లింపులు జరిగినట్లు బృందం సభ్యులు ప్రజావేదికలో వెల్లడించారు. దీంతో పాటు పలురకాల పొరపాట్లను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండల పరిధిలో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించి రూ.13వేలు జరిమానా విధించగా, రూ.1237 రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డీఆర్‌డీవో మాట్లాడుతూ.. అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా విధులు నిర్వర్తించి అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు అవగాహన కల్పించి అధిక పనిదినాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి కిరణ్, అంబుర్స్‌మెన్ శివరామ్, ఎస్టీఎం వేణు, ఎస్ఆర్పీ దేవేందర్, ఎంపీడీవో మహేందర్, పంచాయత్‌రాజ్ ఏ.ఈ విష్ణుకుమార్, ఏపీఎం ఎస్తర్ డేవిడ్, ఈసీ అనిల్, సూపరింటెండెంట్ వేణు గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సుగుణ

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం విద్యుత్‌ఘాతంతో ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.10వేలు, నిత్యవసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి వారికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అందించే తక్షణసాయం రూ.95వేలు త్వరగా అందేలా కృషి చేయాలని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డిని కోరారు. ఇటీవల బెహరన్ దేశంలో మృతి చెందిన కుకటికారి రమేష్ కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. సుగుణతో పాటు గ్రామ కమిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి, ఏఎంసీ డైరెక్టర్ ప్రదీప్, నాయకులు చంద్రయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంజనకు సన్మానం



సన్మానిస్తున్న టేకుమట్ల వాసులు

జైపూర్: మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన ఈసం రమేశ్–స్వప్న దంపతుల కుమార్తె ఈసం సంజన ఇటీవల ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంజనను మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ తరపున క్రికెట్ కిట్టును అందించనట్లుగా తెలిపారు. స్థానిక నాయకులు ప్రోత్సాహకంగా రూ.5వేలు, క్రీడా సామగ్రి అందించారు. కార్యక్రమంలో సెక్రెటరీ శ్రావణి, పీటీ గోపాల్, మాజీ సర్పంచ్ సుమలత, ఎంపీటీసీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

బీటలువారిన బీటీ రోడ్డు



భీమారం: మంచిర్యాల-చెన్నూరు క్రాస్ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని పోలంపల్లికి గతంలో బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఆ బీటీరోడ్డు ధ్వంసమై బీటలువారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ విషయంలో అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సదానందం, ప్రత్యేకాధికారి, పోలంపల్లి   ఫోన్ నంబర్ : 98483 84636

సంక్షిప్త వార్తలు

- **2న బర్డ్‌వాక్**

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలో ఫిబ్రవరి 2న బర్డ్‌వాక్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు మంగళవారం తెలిపారు. బర్డ్‌వాక్‌లో పాల్గొనదలచిన వారు ఫిబ్రవరి 1న రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 9989591096 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

- **'యూనిఫైడ్ పెన్షన్ స్కీం సరికాదు'**

మంచిర్యాలఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1, 2025 నుంచి అమలు చేయనున్న యూని ఫైడ్ పెన్షన్ స్కీం సరికాదని టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర గౌరవ సలహాదారు ఇన్నారెడ్డి అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో యూనిఫైడ్ పెన్షన్ స్కీంకు సంబంధించిన గెజిట్ పత్రాలు దహనం చేశారు. కొత్త పెన్షన్ స్కీంను విరమించుకుని ప్రతి ఉద్యోగికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

- **చర్యలు తీసుకోవాలి**

కాసిపేట: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై వాట్సప్ గ్రూప్‌లో ఇర్ఫాన్ అనే వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. దేవాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వెంటనే అతడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఆదివాసీల పక్షాన ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆడ జంగు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతరావు, ఆత్రం జంగు తదితరులున్నారు.

- **స్విమ్మింగ్ పూల్ వినియోగంలోకి తేవాలి**

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని మందమర్రి, రామకృష్ణాపూర్‌లో గల స్విమ్మింగ్ పూల్స్‌ను యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. నీటిలో నాచు తయారై అధ్వానంగా ఉందని, వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. స్విమ్మింగ్ పూల్స్‌ను మంగళవారం సందర్శించిన అనంతరం సత్యనారాయణ మాట్లాడారు. కార్మికుల ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్స్ నిర్వహణ సరిగ్గా లేదని మండిపడ్డారు.

- **అవార్డు గ్రహీతకు సన్మానం**

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత అలేఖ్యకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాగా మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, అసోయేషన్ సభ్యులు ఆమెను సన్మానించారు.

- **విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు**

చెన్నూర్‌రూరల్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మండలంలోని కొమ్మెర సెక్షన్‌లోని దుగ్నెపల్లి, చెల్లాయిపేట గ్రామాల్లో చెన్నూర్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొమ్మెర ఏఈ శ్రీనివాస్, లైన్‌ఇన్స్‌స్పెక్టర్ రాజమల్లు, లైన్‌మెన్ అంజి పాల్గొన్నారు.

- **నియామకం**

లక్సెట్టిపేట: తెలంగాణ సిక్లిగర్(సిక్కుల) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన సర్దార్ రంజిత్‌సింగ్ ఎన్నికైనట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అశా సింగ్ బాగ్ గురుద్వారా సాహెబ్ వద్ద నిర్వహించిన నూతన కమిటీలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

- **'మెడికల్ కార్డు దరఖాస్తులు బీఎంఎస్ ఘనత'**

శ్రీరాంపూర్: సింగరేణిలో మెడికల్ కార్డు(సీపీఆర్ఎంఎస్) లేని వారు దరఖాస్తు చేసుకునేలా ఉత్తర్వులు ఇప్పించిన ఘనత బీఎంఎస్‌దేనని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- **'బర్తరఫ్ చేయాలి'**

లక్సెట్టిపేట: గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడు ముల్కల్ల రాంధాస్ మంగళవారం ఖండించారు. ఐఖ్య ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంజయ్‌ని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు.

ఏరియాలో సేఫ్టీ రివ్యూ మీటింగ్



మాట్లాడుతున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ఏరియా జీఎం దేవేందర్ హాజరై ఏరియా గనుల్లోని సేఫ్టీపై ఆయా విభాగాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సూపర్‌వైజర్లు పని స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కార్మికులతో పని చేయించాలన్నారు. రక్షణ విషయంలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఆఫీసర్ రఘుకుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఏరియాలోని ఆయా గనుల అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899